ఆసించకుండా జట్కారస్తానే పయనిస్తూ పరకాయిస్తుమా ఆ వేళ కీనాడూ సూర్యాస్తమానమే కనిపిస్తుంది. ఆసూర్యాస్తమానం ముందు నేటికీ ఆ " సిల్హూటీనృత్యమే " వెలిగిస్తుంది !

.... .... .... .... ....

## వాసాంసి జీర్ణాని

" వాసాంసి జీర్ణాని "—అయితే వసనము జీర్ణించనిదై యుండగా దానిని విడిచినప్పుడు ?—పై శ్లోకము చదివినప్పుడల్లా నాకు అలా జిజ్ఞాస వెనువెంటనే పోతూ వుంటుంది.

అప్పటిరేయి యిప్పటికీ నాకు బాగా జ్ఞాపకం—నేను—ఆమె—మేమిద్దరమే వున్నాం ఆ గదిలో. మళ్ళీ తెల్లారు నవసరములేనట్టుగా కనబడిందికాలం. మఱిన్ని లోకమంతా ఆ చిన్నగదిలోనే ఇమడ్చబడి వున్నట్టుగా, మాకేమీ లోటు అనిపించలేదు. ఆ గదిలోని గాలికూనలన్నీ కల్పతరశాఖల చేతనే వీవబడినట్టు మాకు తగిలి ఆనందం గొల్పాయి.

ప్రేయసి యొకానొక నూతనాతినూతనమైన చుట్టుచెంగావి కోక ధరించి మఱుక్షణమందే దానినలా బుజాలక్రిందుగా, పృథుజ ఘనం క్రిందుగా దిగు దిగువ కూడ్చుకుంటూ, ఎందుకో చిరునవ్వు నవ్వింది, నన్నావంకకు చూడవద్దంటూ.—

" సరిక్రొత్తకోక నలా కట్టీకట్టకుండానే విప్పి పారవేస్తూ వున్నావేమిటి ? ఛా ! " అని క్రిందడ్డచీరను ఆమెచేతి కందివ్వ బోయాను. " అది మీ కండువా ! నా చీర అనుకొన్నాను—మీకొక కండువా నాకొక చీర—చుట్టుచెంగావిరంగు వేయించినవి పొందుపరిచి యుంచాను. అది మీది " అంది.

నిజం నాకు చుట్టుచెంగావి రంగున్న కండువాలన్నా, పంచెలన్నా చాలా మక్కువ. అయితే కట్టుకోవడమన్నా, వేసికోవడమన్నా ఏమిటో వెంబాటూ, విచింతనమూను. అందుచేత ఆమె, నాడు, ఆ గదిలో వాటి నతిరహస్యంగాదాచి, పొరబాటున చీరనుకొని, నా కండువా ధరించబోయింది కామోసు.

కాని కండువా చీరంతపొడుగుండదు. ఎదరవేసుకుంటే ఆమెకు నాటిరేయి వెనుక కందలేదు. వెనుకకు వేసికొంటే ఎదర కందలేదు ! తుదకేమా అని కండువాగా గ్రహించి విప్పి జార వేసింది—విప్పి జారించినప్పటి ఆ యొప్పులకుప్ప అందానికి నా కళ్లు రెండూ వొప్పజెబుతూ........ఆమెయో ? విషంమినహా తాచుపాములా నను మెత్తవడింది........

" ఈ కండువా చిరిగిపోయినప్పుడు సుమా మనకు ఎడ్ర బాటు. " వాసాంసి జీర్ణాని " అని ఉటంకించుకుంటూ ఉవ్విళ్ళూరాను. " ఈ కండువా మీ కోసంగాను అద్దించాను. మీది " అంది ప్రియురాలు. " నీవు ధరించడంలో, అది నీకు, నీకు అది, ముద్దులొలికించు కొన్నట్టుగా కాపడింది. ఆ కండువా నీదే అలా వుణ్ణియి. " అని ఆమె మొలకదిచుట్టబెడుతూ—నేను నిదర పోయాను. లోకం నిదురించింది.

తెల్లవాఱి అరుణోదయకాంతినే నా ప్రయాణం. ఆమె—ఆమె—అరుగుమీద నిలబడి " ఇదిగో ! ఈ పొట్లం మీతో వుణ్ణియ్యండి " అంది. అరుగుప్రక్క నిలబడి ఆమెవంక చూస్తూ ఆమె యిచ్చేది అందిపుచ్చుకుంటూ ఏముందిందులో అంటూ విప్పాను. " మీ కండువా " అంది. " కాదు నీ చీర " అని పైకి విసిరాను పొట్లాం తిరిగి. " నా చీర నేను కట్టుకున్నాను.

ఇదిగో మీ కండువాయే" అంది. "కాదు" చీర చింపితే వచ్చిన తునక ఆ కండువా" అన్నాను. "అయ్యో! అది ప్రత్యేకించి మీ కోసం అద్దించిన చుట్టుచెంగావి కండువా అండీ! ఇదిగో నా చీర చెంగుచీర చెంగే" అంటూ తన వీపుమీది పయట కక్ష మార్గంగా ఎదరకు తెచ్చుకుని—ఆమెయొక్క వయస్సు వక్షోజ యుగళానికి నిజమైన గుండ్రదందనం, గ్రుచ్చుకోలు ఏర్పడేలా కాపరిచింది. పొట్లం విప్పుతూ కండువా అంచులు వేర్పాటుగా నా యెదురొమ్మున నామాల్లా కనబడేలా అమిర్చింది. అమరుస్తూ "బట్టచిరిగినా తావేసిన చుట్టుచెంగావిరంగు అలా వుంటుంది అని నమ్మించి మరీయిచ్చాడు ముచ్చి" అంది ఆ యెలనాగ. అంటూ తాను ఆ కొలదిపాటు ఎడబాటుకూడా సహించలేనేమో అను కుంటాను, కంట నీరెట్టుకుని అలా తన చీరచెంగు నద్దుకుంది.

"మీయూరి ముచ్చి పనివానితనం కన్నీళ్ళ గుప్పళించి పరీక్షిస్తున్నావా?" అన్నాను.

ఆ ప్రశ్నకు, తడిచెంగునలా ఆరబట్టి, తేటుకళ్ళతో— "కన్నీళ్ళతో ఎవరైనా పరీక్షిస్తారా? కలుగబోయే మనమధ్య— అచిరకాలపుదే అగుగాక—యెడబాటు సహించలేక అవి అలా వాటంతటవి వచ్చివేశాయి. అప్రయత్నంగా చెంగు నద్దుకున్నాను. అయినా చూడండి రంగు అలాగ్గానేవుంది. ఏ మాత్రం చెక్కు చెదరలేదు." అని చిరునవ్వు నవ్వింది. "మఱి సెలవు" అన్నాను ఆమెనదో పెద్దగాచేసి.

ఆమె—ముగ్ధయై—వంగి—వంగి వీధివంపు నింకా వంగిం దేమో? నేను వెనక్కు తిరిగి, ఆవంపు నిసుమంతా చూడలేక పోయినాను. తెలిసికోజాలక పోయినాను.

కొన్నాళ్ళకే "చాలా జబ్బుస్థితిలో నున్నది" అని నాకో తంతివార్త! ఉత్తరక్షణమందు మా ప్రణయగాధ కోస్వస్తి— నాకామె అద్దించి అమర్చిన చుట్టుచెంగావి కండువా ఇంకా గట్టిగానేవుంది. దానితో నా కన్నీళ్ళ నెంతగా తుడిచి ఆరబట్టినా ఆ రంగు వట్టిరంగుగా తిరోహితం గావడంలేదు. స్థిరపడి పోయింది.

ఒకవేళ వసనం చివికి చిరిగి జీర్ణించి పోయినా చనిపోయే దెవరు? ఆమె కాదు. నేను!

.... .... .... .... ....

## పొగకర్రలు

నా సంతానంలో ఒకానొక చిరుసగవు శిశువు చనిపోయినప్పుడు, "ఎక్కడ పాతిపెట్టారు?" అని అడిగాను నా తండ్రిని. అప్పటికి మా తండ్రిగారు జీవించివున్నారు. ఆయన నన్ను గదుముతూ "నీ కెందుకు వానిని గుఱించి మఱి ఆందోళన, ఆలోచన. ఆవాడు పున్నమ వెన్నెల రేని వెళ్ళిపోయినాడు. చంద్రబింబంలో వుంటాడీపాటికి!" అని సమాధానం చెప్పాడు. పెద్దలు చెప్పినమాట విశ్వసించాలికదా అని ఆలా చంద్రబింబం కేసి చూస్తూ నివ్వెఱపోతున్నాను నాటికీ నేటికీ "ఎన్నడా చంద్ర కవాటం తెరవడం?" అని. నాకు సాధ్యమౌతుందా?

మఱో అప్పుడు మఱో శిశువు—సొంతబిడ్డ! కేరుమన కుండానే స్వర్గలోకం చూఱగొన్నట్టు విన్నాను. "ఎక్కడ పాతి పెట్టారు?" అని తిరిగి ప్రశ్నించగా ఇంటిలోని ముసిలిఅవ్వ